అసలు కథ

శేష

'రాజ్యం, ఏయ్ నిన్నే' పిలుపు. పిలుపు వెంట టకటకమని చప్పుడు. ఒకదానివెంట ఒకటి రాజ్యం చెవికి దగ్గర పతిదేవుడి నోటిమాట తెలిసిపోయి ఉలిక్కిపడి చటుక్కున వెక్కు తప్పుకొని పక్కన నవ్వేసింది రాజ్యం. తలుపు తీయకుండానే భార్యామణిని కౌగిలించుకొందామనుకొన్న సుబ్బారావు తన ఆశ వ్యర్థంకావటంలో ఉసూరుమని అంతలోనే నవ్వుతెచ్చుకొని రాజ్యం చేతిలో పూలపొట్లంపెట్టి టవల్ తీసుకొని స్నానం చెయ్యటానికి వెళ్ళిపోయాడు.

భర్తకి కాఫీ, టిఫిన్ అమర్చి తను పూలమాల కడుతూ కూర్చుంది. సుబ్బారావు తడితువ్వాలుతో మొహం తుడుచుకొంటూ కుర్చీలో కూర్చుని ఉప్మా ప్లేటు అందుకొన్నాడు. 'ఉత్తరాలేమైనా వచ్చాయా?' అన్నాడు సుబ్బారావు.

'మావాళ్ళదగ్గర్నుంచి వచ్చింది' అంది రాజ్యం మాలకట్టటం పూర్తిచేసి జడలో పెట్టుకొంటూ. 'ఏమని రాశారో చెప్పు. ఇప్పుడు నేను చదవలేను' అన్నాడు సుబ్బారావు కాఫీ తాగుతూ. 'నన్ను పంపించమన్నారు నోములకి శ్రావణమాసంలో.'

'మొన్ననేగా వచ్చింది దేవిగారు— ఐనా ఆడవాళ్ళకి అంత మమకారం ఉండకూడదు పుట్టిళ్ళమీద.'

'మొన్న ఏమిటి మార్చిలో వచ్చాను తెలుసా!' అంది అభిమానంగా రాజ్యం.

'సరేగాని రాజా, ఈపూట ఏదైనా పిక్చర్‌కి పోదామేయ్' అన్నాడు సుబ్బారావు.

'ఇప్పుడా?! వంట ఎవరికి అప్పచెబుదామంటారు?' అంది రాజ్యం నవ్వుతూ.

'వచ్చేటప్పుడు హోటల్‌లో తిందాంలే బయల్దేరు' అన్నాడు. 'ఇదిగో ఐదు నిముషాలు' అంటూ లేచింది రాజ్యం.

* * *

మర్నాడు మబ్బు మబ్బుగా ఉంది ఆకాశం. సన్నగా తుంపర పడుతూనే ఉంది ఉదయం నుంచి. సాయంత్రం భర్త వచ్చే వేళకి తెల్లచీర కట్టుకుంది రాజ్యం. భారుగా వాలుజడ అల్లుకొని సన్నజాజుల మాల పెట్టుకొంది.

నిముషాలు దొర్లిపోతున్నాయి. చాలా ఆలస్యంగా — ఎనిమిది గంటలవేళ వచ్చాడు సుబ్బారావు. రాజ్యం పలకరించకుండా కూర్చుంది కోపంగా. భార్య సింగారం సుబ్బారావు గుర్తించిన జాడేమీ కనిపించలేదు. మాట్లాడకుండా స్నానం చేసి అన్నంతిని పక్క ఎక్కి పడుకున్నాడు. రాజ్యం ఆశ్చర్యపోతోంది. పెళ్ళై మూడు నెలలన్నా కాలేదు. ఇంతవరకూ ఈ విధమైన ప్రవర్తన ఎరగని రాజ్యం హడలిపోయింది. ఏమీ అర్థంగాలేదు. ఆలోచనలతో సతమతమమై నిద్రాదేవితో రాజీపడిపోయింది.

పక్కమీద పడుకొన్న మాటేగాని నిద్రాదేవి సుబ్బారావు చాయలకు కూడా రాలేకపోయింది.

సుబ్బారావు మనస్సు ఆలోచనలతో కుతకుత లాడిపోతోంది. ఎంతమోసం! ఏమీ ఎరుగని దానిలా రాజ్యం ఎంత మోసం చేస్తోంది. ఈ విషయం పుస్తె చేతుల్లో ఉన్నప్పుడు తెలిసినా తను జాగ్రత్త పడేవాడే! ఐపోయింది. సర్వనాశనం ఐంది తన బ్రతుకు. తనభార్య మనసారా తన్నే వాంఛించాలని ఆశించడమే తననేరమై పోయింది. హు...రామం! కోపంతో పళ్ళు కొరుక్కున్నాడు సుబ్బారావు. ఎంతో మంచివాడిగా నటిస్తూ తనతోపాటు తిరుగుతున్న రామం తన జీవితం నాశనమవటానికి కారణం అని ఇప్పుడు తెలిసింది. వెధవ! తడిగుడ్డతో గొంతుకోసే రకం? ఇద్దరూ

ఇద్దరే నటనకి. ఉత్తమనటులు: కసితో అనుకొన్నాడు. రేపే అసలు విషయం తెల్చుకోవాలి. అనుకొంటూ రాజ్యం ఏంచేస్తోందో అని పక్కకి చూశాడు. తెల్లబట్టలు, తెల్లటి పూలతో అమాయకంగా నిద్రపోతూ కనిపించింది. మరుక్షణంలో అది అమాయకత్వం కాదు రాక్షసత్వం అనిపించింది. ఆలోచనలతో అలాగే నిద్రపోయాడు సుబ్బారావు.

* * *

ఉదయం లేచిందగ్గర్నుంచి ముభావంగానే ఉన్నాడు సుబ్బారావు. ఆఫీసు టైం కాకపోయినా భోజనంచేసి వెళ్లిపోయాడు రాజ్యం భోజనం చెయ్యలేదు. చెయ్యలేకపోయింది. రాత్రి నుంచి భర్త తనతో మాట్లాడకపోవటం భయం పుట్టిస్తోంది.

‘హల్లో! సుబ్బారావు ఏమిటి నిన్న నేను స్నానంచేసి వచ్చేలోగా మాయమయ్యావు’ అన్నాడు రామం ఆప్యాయంగా స్నేహితుడి చెయ్యిపట్టుకొని. ఆపట్టు నాగుపాము పట్టులా తోచింది సుబ్బారావుకి. రామం ఉచ్ఛ్వాస నిశ్వాసలు అతనికి బుసలుగా వినిపించాయి. మొత్తానికి అతని కళ్లకి రామం మూర్తీభవించిన నాగుపాములా కనిపించాడు. చెయ్యి విడిపించుకొంటూ మామూలుగా నవ్వాడు. ‘ఏం లేదోయ్, ఆఁ. అన్నట్టు ఈరోజు నువ్వు మాఇంటికి రావాలి’ అన్నాడు సుబ్బారావు.

‘ఏమిటి విశేషం.’

‘పనుంది’ అంటూ తన సీట్లోకిపోయి కూర్చున్నాడు సుబ్బారావు.

సుబ్బారావుని ఓక్షణం చూసి రామం కూడా తన సీట్లో కూలబడ్డాడు.

* * *

సాయంత్రం స్నేహితులిద్దరూ సుబ్బారావు ఇంటికివచ్చారు. రామం బెరుకుగా వరండాలో నిల్చుంటే సుబ్బారావు చనువుగా లోపలికి తీసుకువెళ్లాడు.

‘రాజ్యం, నా ఫ్రెండ్ రామం’ అని భార్యకి పరిచయం చేశాడు సుబ్బారావు జాగ్రత్తగా ఇద్దరి మొహాల్లోని భావాలు చూస్తూ.

‘నమస్తే’ అని రాజ్యం అంటే ప్రతినమస్కారం చేయబోయిన రామం చేతులు అలాగే మధ్యలో వాలిపోయాయి. అతనికళ్లు ఆశ్చర్యంతో వెడల్పయినాయి. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్టు పెదవులు అస్పష్టంగా కదిలాయి.

రాజ్యం వైపు చూశాడు సుబ్బారావు. మామూలుగా, చాలా మామూలుగా కుర్చుని ‘టీ’ కలుపుతోంది. మొహంలో ఎలాంటి భావాలు వ్యక్తం కావటం లేదు. టీ కలపటం పూర్తిచేసి ఒక కప్పు రామానికిచ్చి మరో కప్పు సుబ్బారావు కిచ్చి తనోకప్పు తీసుకొంది. రామం కొంచెం తేరుకొన్నాడు కానీ అతనిలోని ఆదుర్దాను, విస్మయాన్ని, కనిపెడుతూనే ఉన్నాడు సుబ్బారావు. సుబ్బారావు అడిగిన వాటికి అన్యమనస్కంగా జవాబులిస్తూ పరధ్యానంగా రాజ్యాన్ని చూస్తున్నాడు. అతని చూపుల్లో పాత జ్ఞాపకాలను త్రవ్వకొంటున్న సూచనలు కనిపించాయి. ఏవో మామూలు మాటలు తప్పించి పెద్ద సంభాషణ ఏమీ జరగటం లేదు. ఆ పరిస్థితి ముగ్గురికీ ఇబ్బందిగానే ఉంది. మరో పదినిముషాలు నిశ్శబ్దంగా గడిచి పోయాయి. హఠాత్తుగా లేచి నిలబడి ‘నేను వెళ్తానోయ్’ అన్నాడు రామం. మౌనంగానే గేటువరకు సాగనంపాడు సుబ్బారావు. లోపలికొచ్చాడు సుబ్బారావు. రాజ్యం వైపు చూశాడు. ఏదో ఆలోచిస్తోంది రాజ్యం. మౌనంగా కుర్చిలో కూర్చుని పేపర్ చూస్తూ అనుకున్నాడు సుబ్బారావు. ఈ ఆడవాళ్లెంత తెలివి ఐనవాళ్లు. ఆహా రాజ్యం నీ నటన మెచ్చుకోతగ్గదే! కానీ నీ రహస్యం నాకు తెలిసిపోయింది కాబట్టి నేను మోసపోను...

హఠాత్తుగా పేపర్ మూసేస్తూ సూటిగా రాజ్యం కళ్లలోకి చూస్తూ ‘నీతో నేను కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి’ అన్నాడు. భర్త అంత హఠాత్తుగా అంత కొత్తగా మాట్లాడుతుంటె తెల్లబోయిన రాజ్యం తల ఊపింది అయోమయంగా.

‘నన్నెందుకింత మోసం చేశావు?’

అదిరిపడింది రాజ్యం.

‘బహుశ ఈ విషయాన్ని నీవంత సీరియస్‌గా తీసుకొని ఉండకపోవచ్చు. అది నా కనవసరం. కానీ కనీసం నా జీవితంలోకి ప్రవేశించేటప్పుడైనా ఈ విషయాన్ని గురించి నీ వెందుకు ఆలోచించలేదు. పసిపిల్లలలానే భావించాలా? ప్రేమా, పెళ్లి గురించి.’

నిశ్చేష్ట అయింది రాజ్యం: ఆమెకి భర్త మాట్లాడుతున్నదేమిటో అర్థం కాలేదు.

‘మీరు మాట్లాడేదేమిటి ?’ అంది తడబడుతూ.

‘తెలుగు’ ఆపుకోలేని కోపం వచ్చింది సుబ్బారావుకి. ఐనా తమాయించుకొన్నాడు. కాలాన్ని జరిపి ఆవేశాన్ని చల్లార్చగలరీ ఆడవాళ్లు. ‘ఓహ్. రాజ్యం నువ్వెంత తెలివిగలదానివైనా తప్పటడుగువేశావు. అది ఒప్పుకో అనవసరంగా వృథాప్రయాసపడక.’

‘మీరనేదేమిటో నాకు నిజంగానే అర్థం కావటంలేదు. మోసం చెయ్యటమేమిటి ? ఏ విధంగా మోసం చేశాను మిమ్మల్ని.’ అప్పటికే కన్నీళ్లు ధారలు కట్టాయి. భయం, దుఃఖం గుండెల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.

కాపరానికి వచ్చాక ఇంతవరకు కన్నీళ్లు పెట్టుకోలేదు రాజ్యం. సుబ్బారావు మనస్సు ఒక్కక్షణం జాలితో నిండిపోయింది. మరుక్షణం తేరుకొని కోపంగాచూస్తూ ‘రామం విషయంలో నన్ను మోసగించలేదా నువ్వు?’ అన్నాడు

‘రామం విషయమా!!!’

‘ఔను! ఇంకా నటించకు రాజ్యం, వ్యర్థమౌతుంది. నా కంతా తెలుసు. నీ ప్రణయం నీకు తప్పుకాకపోవచ్చు. కానీ ఆ విషయం నీవు ఒక్కసారన్నా ముందుగా చెప్తే నా బ్రతుకులో నిప్పులు పోసుకొనే వాణ్ణికాదు. నేను సామాన్య మానవుణ్ణి. నా ఆశ తప్పని నేను అనుకోవటం లేదు. నా భార్య నన్ను ప్రేమించాలి అనుకోవటం తప్పని ఎవరూ అనరు. అందులో తన భార్య స్వచ్ఛమైన కన్నెపిల్ల అయిఉండాలని ప్రతి మగవాడు ఆశించుతాడు. ఇంక నీ జవాబుకోసం నేను వేచి ఉండక్కర్లేదు. ‘నన్ను క్షమించండి’ అంటావు. కానీ అది నావల్లకాదు. నా నిర్ణయం తెలియచేస్తున్నాను. మనం కలిసిఉండటం అనేది కల్ల! ఆ తరువాత నీఇష్టం.’ ఆయాసంగా వగర్చాడు. మళ్లీ పేపర్‌లో మునిగిపోయాడు.

రాజ్యం బొమ్మలా నుంచున్నదల్లా ఒక్కసారి చైతన్యస్రవంతియై భర్తపాదాల దగ్గరకు పరిగెత్తి ‘నాకేం తెలియదండి నన్ను క్షమించండి’ అంది ఏడుస్తూ.

ఏవో చల్లని హస్తాలు తనను లేవ

నెత్తుతుంటే భయంగా తలెత్తింది. నిర్మలమైన చిరునవ్వుతో రాజ్యాన్ని దగ్గరకు తీసుకొంటూ 'నిజంగా తప్పుచెయ్యనప్పుడు క్షమాపణ కోరుకోవటం ఒక పెద్ద తప్పమ్మా' అంది ఆవిడ.

ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు. ప్రక్కనే **రామం. ఆమె రామం భార్య సీత.** బిగుసుకుపోయాడు సుబ్బారావు. ఇప్పుడెందుకు వచ్చినట్టు వీళ్ళు. ఐనా ఇప్పుడేగా రామం వచ్చివెళ్ళింది. అయోమయంగా ఉంది సుబ్బారావుకి.

రామం, సీతా కూర్చున్నారు. సీత తన పక్కనే కూర్చోబెట్టుకుంది రాజ్యాన్ని. 'రాజ్యం పరిస్థితి అంతకన్నా ఘోరంగా ఉంది. తమ గొడవల్లో వీళ్ళెందుకు వచ్చారో. అయనమాటలకి తనగుండె ఎందుకు ఆగిపోలేదో, తన ఊపిరి ఎందుకు ఆగిపోలేదో ఆమెకి అంతుపట్టలేదు.

చీకటి పడింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. దారుణమైన నిశ్శబ్దాన్ని చీల్చుకొని రామం మాట్లాడాడు. 'సుబ్బారావు నీకు చాలా సంగతులు చెప్పాలోయ్. ఇందాకే నేను చెప్పాల్సింది ఇవన్నీ. కానీ నేను పిరికిగా వెళ్ళిపోయాను. ఇంటికెళ్ళాక సీత కేకలేసి వెంటనే తీసుకొచ్చింది. సరే ఇంక మొదలుపెడతాను. నేను బి. ఎ. థర్డ్ ఇయర్‌లో ఉండగా గోవిందరావుగారు మా ఇంటిప్రక్కన ఉండేవారు. వారి కుటుంబానికి మాకు చాలా

అసలు కథ

స్నేహం ఉండేది. గోవిందరావుగారు ఎప్పుడూ అంటూ ఉండేవారు 'నాకే గనక ఓ కూతురు ఉంటే నీకిచ్చేవాణ్నోయ్' అని. నేను నవ్వేవాణ్ని. ఇలా రోజుకు ఒకసారన్నా అలా అంటం ఆయనకి ఇష్టం. ఒకరోజు ఆయన భార్య కూడా అక్కడే ఉంది. ఆయన అలా అనేసరికి ఆవిడ నవ్వుతూ 'పోనీ మీకు లేకపోతే ఏం, రాజా నివ్వరాదు. రాజా కూడా మీ కమ్మాయే ఔతుందిగా,' అని అంది. ఆయన ఆలోచిస్తూ 'నిజమే' అన్నారు. నాకు ఆ రాజెవ్వరో అంతుపట్టలేదు. నేను పట్టించుకోలేదు. రోజులు గడిచి పోతున్నాయి. ఒకరోజు ఆయన ఒక ఫోటో తీసుకొచ్చి మా ఇంట్లో వాళ్ళకి ఇచ్చారు. ఆ రాత్రి మా అమ్మ నాకు ఆ ఫోటో ఇస్తూ 'గోవిందరావుగారు ఇచ్చార్రా, వాళ్ళ అన్నగారమ్మాయి' అంది. నేను ఫోటో అలాగే తీసుకొని నా గదిలోకి వచ్చేశాను. చాలాసేపు ఆ ఫోటో చేతిలో పెట్టుకొని చూశాను. కాంతులీనుతూ చూసే చూపులు, రాబోతున్న నవ్వును పెదవులలో బిగించి నవ్వుతూ నన్నే చూస్తున్నట్లనిపించింది. మొత్తానికి ఆ ఫోటోలో అమ్మాయి చాలా బాగుంది. క్రింద రాజా బి. ఏ అని రాసుంది. చాలా సేపు చూసి చివరికి పుస్తకాల బీరువాలో పెట్టాను. రోజులు గడిచిపోతున్నాయి.

గోవిందరావుగారు ఫోటో అడగలేదు. మేం ఇవ్వలేదు. నా పెళ్ళి సంగతి కదిపితే ఉద్యోగం రానివ్వండి అన్నారుట మా వాళ్ళు. ఇంతలో పబ్లిక్ పరీక్షలు వచ్చాయి. నేను పరీక్షల గొడవలో ఉండగానే గోవిందరావుగారికి ట్రాన్స్‌ఫర్‌రావటం ఆయన వెళ్ళిపోవటం జరిగింది. అంతే క్రమంగా ఆ విషయం మేమందరం మర్చిపోయాం. నాకు ఇక్కడే యల్.ఐ.సి. లో ఉద్యోగం వచ్చింది. వెంటనే సీతతో నా పెళ్ళైపోయింది. సీత కాపురానికివచ్చిన కొత్తల్లో'...ఆగి సీతవంకచూసి నవ్వేడు రామం. సీత చిరుకోపంతో చూసింది రామంవైపు. రామం మళ్ళీ ఆరంభించాడు. 'ఆ కొత్తల్లోనే ఒకరోజు పుస్తకాల బీరువా తీసి సర్దుతూ ఒకఫోటో బైటపడగా అది చూసి స్తంభించిపోయింది. ఇంక ఆ వరసలో వారంరోజులు నాతో మాట్లాడలేదు. ఆఖర్ని బతిమాలి ప్రసన్నురాలిని చేసుకునే సరికి బ్రహ్మ ప్రళయమైంది. నేను ఎంత చెప్పినా నమ్మలేదు. ఆఖరికి మా అమ్మ చేత సాక్ష్యం ఇప్పించక తప్పలేదు. మా మధ్య ప్రళయం తెచ్చిన ఫోటోని నేను చింపెయ్యబోతే సీత వద్దని నివారించింది. 'అది మన కలహానికి చిహ్నంగా ఉంటుంది. ఎవరో ఈ అమ్మాయి నాకు మంచే చేసింది' అంటూ ఆల్బంలో జాగ్రత్త చేసింది. క్రమంగా ఆఫీసులో మన ఇద్దరి మధ్య స్నేహమైంది. నిన్న నీవు వచ్చిన వాడివి నేను వచ్చేవరకైనా ఉండకుండా చెప్పకుండా రావటం మా ఇద్దరికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. టేబిల్‌మీద ఆల్బం ఉన్నా అప్పుడు మాకేమీ అనిపించలేదు.

ప్రొద్దుట నీ ప్రవర్తన నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. అనుకోని నీ ఆహ్వానం నన్ను సందిగ్ధంలో పడేసింది. దానికి తగ్గట్టు నీవు మీ శ్రీమతిని పరిచయం చేశావు. అంతే నేను ఏమిచూస్తున్నానో నాకే అర్థంగాలేదు. మీ శ్రీమతిని చూసి స్తంభించి పోయాను. నా కళ్ళు నన్నే మోసం చేస్తున్నాయేమో అనిపించింది. అవే కళ్ళు, ఆమే, సందేహంలేదు ఆ ఫోటోలోని అమ్మాయి ఈమే. అంతులేని ఆశ్చర్యంతో దిమ్మెరపోయాను.

నా సందేహం తీరిన కొద్దీ ఆశ్చర్య పోయాను. వెంటనే చెప్పాలనిపించింది. కానీ ఈ సంగతి మీకు తెలియదుకదా? తెలియని వాళ్ళకి ఇందులో భాగమెందు కులే. అదికాకుండా నీవేమైనా అపార్థం చేసుకొంటావేమోనని చెప్పలేదు. వెంటనే ఈ సంగతి సీతకి ఎంత త్వరగా చెబుదామా అని వెళ్ళిపోయాను, తీరా ఇంటికెళ్ళి తనతో చెప్తే రెండు నిమిషాలు ఆలో చించి 'మీరు చాలా పొరబాటు చేశారు మీ స్నేహితుడు బహుశ నిన్న ఫోటో చూసి ఉంటాడు. అపార్థం చేసుకొన్నాడు. అందుకే ఈ పూట మిమ్మల్ని పిలిచాడు కానీ పాపం ఆ అమ్మాయి ఎంతో బాధ పడుతూ ఉంటుంది. ఈపాటికి వాళ్ళిద్దరి మధ్య అపాంతరం వచ్చి ఉంటుంది. వెంటనే మనం అక్కడికి వెళ్ళాలి' అని ఇక్కడి తీసుకొచ్చింది. అంటూ ఆగి దీర్ఘంగా నిట్టూర్చి అందరివైపు చూసి 'వచ్చినందుకు వృథాపోలేదు. నీవు చాలా ఆవేశపరుడవోయ్...' అంటూ స్నేహ పూర్వకంగా నవ్వేడు రామం సుబ్బారావు కేసి చూసి.

ఇంత సేపటికి సుబ్బారావు, రాజ్యం ఆశ్చర్యం నుంచి తేరుకొన్నారు. సుబ్బారావు రాజ్యం కేసి చూశాడు. ఆ మాయకత్వంతో మూర్తీభవించినట్లుంది.

'దీన్నిగురించి నీకేమీ తెలియదు కదమ్మా' అంది సీత రాజ్యంతో.

'ఊహూఁ. ఫైనలియర్‌లో ఉండగా నా ఫోటో ఒకటి పంపమని రాసింది పిన్ని. నేను పంపాను. అంతే ఆ తరువాత నేనా సంగతే మర్చిపోయాను' అంది రాజ్యం.

'చూశావుటోయ్. ఇది అసలు సంగతి!' అన్నాడు రామం. అందరూ ఒక్కసారి నవ్వేశారు.

'అసలుకథ తెలుసుకోకుండా హడావుడి చేస్తారు మీ మగవాళ్ళు' అంది సీత.

మిగతావాళ్ళంతా నవ్వేసుకుని ఊరు కున్నా, నూతన వధువులు మాత్రం ఊరు కోకండి. మీ ఫోటోలు ఏమైనా పాత పెళ్ళికొడుకులదగ్గరుంటే అది మీబాధ్యత కాదని వరులకి చెప్పేసెయ్యండి. లేకపోతే అనక చాలా చిక్కులు వస్తాయి. ●